# అసమర్ధుడు - సమర్ధుడు

చంద్రశేఖరం ప్రొద్దున్నే లేచి కాంపౌండులో మొక్కలు సాకుతున్నాడు. దాసీమనిషి నీళ్ళుపోస్తోంది మొక్కలకు. ఇంతట్లో తలుపు చప్పుడయ్యింది. తలుపుతీశాడు చంద్రశేఖరం. రమణమ్మ ఎదురుగా ప్రత్యక్షమయింది. చంద్రశేఖరం ఆమెరాకకు ఆశ్చర్యపోయాడు. అసలు తన యిల్లు ఆమె ఎట్లాపట్టుకుందోకూడా అతనికి తెలియలేదు.

రాత్రి మాసినపంచా, ఒంటిమీద తువ్వాలు. చేతులకుమట్టి, ముఖం మీద చెమటలు. తన ఆకారంచూసి చంద్రశేఖరం ఒక్కసారి సిగ్గుపడి, ఆమెను కుర్చీలో కూర్చోమని. లోనికి వెళ్ళిపోయాడు. త్వరత్వరగా స్నానంచేసి, బట్టలు మార్చుకొని వచ్చాడు చంద్రశేఖరం. దాసీమనిషి యింటిపనులు ముగించుకొని వెళ్ళిపోయింది.

"ఇల్లు ఎలా తెలిసింది?"

"స్కూల్లో బంట్రోతును అడిగాను. ఎడ్రసుచెప్పాడు."

"ఏమిటి విశేషాలు? రాకరాకవచ్చారు!" నవ్వాడు చంద్రశేఖర్.

"ఏమీలేదు, మాష్టార్ని చూద్దామని".

నాల్గయిదురోజులనుంచి రమణమ్మక్లాసుకురాలేదు. నల్లగా, సన్నగా ఉన్నా, ముఖంలోఏదో ఒక విచిత్రమైన అందంఉంది. నర్సు ఉద్యోగం చేసుకొంటూ సాయంత్రం మెట్రిక్యులేషన్ పరీక్షకు కడుతోంది. క్లాసులో

ఆమెనుచూస్తూ పాఠంచెబుతూంటే చంద్రశేఖరానికి ఒక నూత్నఉత్సాహం వచ్చేది. ఆమెవేసే కొంటెప్రశ్నలు శేఖరాన్ని ముగ్ధుణ్ణిచేసేవి. పాఠం పూర్తికాగానే ఆమె ముభావంగా ఎవరితో మాట్లాడకుండా వెళ్ళిపోయేది. ఒకసారి వానలో ఇద్దరూ బస్సుస్టాండువద్ద ఇద్దరేఉన్నారు. వానతగ్గేదాకా ఏవో కబుర్లుచెప్పింది. అయితే ధైర్యంచేసి "కాఫీతాగుదాం వస్తావా" అని కూడా అనలేకపోయాడు చంద్రశేఖరం. అయినా ఏదో ఆమెతో మాట్లాడాలని ఆతృత అతనిలోఉండేది. హఠాత్తుగా రమణమ్మరావడం, ఇంట్లో భార్యా పిల్లలు పుట్టింటికివెళ్ళడం అతనికి కొంచెం సరదాగానేఉంది. కాని ఎలా ఆమెతో ఎక్కువ చనువు తీసుకోవాలో అర్థం కావటంలేదు.

"మీతో ఒక్క ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చాను".

"చెప్పండి".

"మీసహాయం ఒకటికావాలి".

"ఏమిటి?"

"అయిదు వందల రూపాయలు అర్జంటుగా అప్పుగా కావాలి".

చంద్రశేఖరం గుండె బితుక్కుమంది. ఆడవాళ్ళు ఇలా డబ్బు అడిగి, మొగాళ్ళకు మోజుకల్గించి తర్వాత "పత్తా" ఉండకుండా మాయమైపోతారనే కథలువిన్న చంద్రశేఖరానికి సహజంగా అనుమానం, భయంకల్గింది. మనస్సులో ఆమెగురించి కల్గుతున్న ఆలోచనలకు కళ్ళెం వేసుకొన్నాడు. భార్య యింటికిరాగానే బ్యాంకుబుక్కు పరీక్షచేస్తే ... గుండెఝల్లుమంది. అతనిమౌనం రమణమ్మకు కొంచెం బాధ కలిగించింది.

"నాదగ్గిర అంతడబ్బు లేదే" అన్నాడు మెల్లిగా.

"మిమ్మల్ని యిమ్మని అడగటంలేదు" అమె సమాధానం.

చంద్రశేఖరానికి కొంచెం ధైర్యం కలిగింది.

"మీదగ్గర ఉన్నా లేకపోయినా యిప్పించగలరని నా మనవి. మీ స్నేహితుడు, నారాయణరెడ్డి వడ్డీవ్యాపారం చేసేమనిషి. కాస్త ఓ మాట చెబితే..." బ్రతిమాలింది.

"అయినా అంతసొమ్ము యిమ్మని ఎలా చెప్పడం" నసిగాడు చంద్రశేఖరం.

"మీమాట కాదనరు రెడ్డిగారు, నాకున్న కష్టం గురించి మీకేం చెప్పేది...మాతమ్ముడు కొత్తగూడెంలో పనిచేసేకంపెనీలో డబ్బు ఐదు వందలు ఖర్చుపెట్టుకున్నాడు, రెండురోజుల్లో ఆడబ్బు కట్టకపోతే జైల్లో వేస్తారని తెలిసింది. వాడిని కాపాడటానికి నాకు యీబాధంతా" కన్నీరు పెట్టుకుంది రమణమ్మ.

చంద్రశేఖరం జాలిమనస్సుకరిగిపోయింది.

"సరే ఆలోచిస్తా...చెప్తా..." నసిగాడు చంద్రశేఖరం.

"చెప్పటం...కాదు...యిప్పించాలి ... ఇవి చేతులు కాదు ... కాళ్ళు... నన్ను రక్షించండి!" సాష్టాంగనమస్కారంచేసిన రమణమ్మ స్థితికి చంద్రశేఖరం పూర్తిగా కరుణామూర్తి అయిపోయాడు. ఆమెను చేతులు పట్టిలేవనెత్తాడు. ఆమె ఏడుస్తూ కళ్ళుమూసుకొని అతనివక్షస్థలం మీద వాలింది. చంద్రశేఖరానికి ఏమనాలో, ఏంచేయాలో తెలియలేదు. ఆమె మూర్ధం నిమిరాడు. ఆమె అలాగే ఉండిపోయింది అయిదునిమిషాలు.

చంద్రశేఖరం అయోమయస్థితిలోపడ్డాడు. ఎదురుగా కంటిముందు కామాక్షి భయంకరంగా చూస్తున్నట్లు కనిపించింది.

"పోనీలే_ మరోసారి యీఅవకాశం యింకోరోజు వాడుకుందాం" అని లోపలమనస్సుని సంతృప్తిపరచి, ఆమెను మెల్లిగా కుర్చీలోకూర్చో పెట్టాడు చంద్రశేఖరం.

రమణమ్మ కుర్చీలో కూర్చుంది. కాని ఎందుకు అలా కుర్చీలో కూర్చోపెట్టేశాడు? ఆమెకు అర్ధంకాలేదు, కాస్సేపు విచారంగా ముఖం పెట్టి, తర్వాత నవ్వింది. చంద్రశేఖరం బలవంతంగా గుటకలుమింగాడు. అతని చేతకాని పరిస్థితికి లోలోపల నవ్వుకుంది రమణమ్మ.

"సాయంచేస్తానని" వాగ్దానం చేశాడు చంద్రశేఖరం. మర్నాడు రెడ్డిదగ్గరకువెళ్లి బలవంతపెట్టి డబ్బు ఐదువందలు అప్పు ఇప్పించాడు. అతను హామీగా సంతకంచేశాడు.

డబ్బు పుచ్చుకొన్న రమణమ్మ రెడ్డిగారిని, చంద్రశేఖరాన్ని వేయినోళ్ళ ప్రస్తుతించి, మందస్మితంతో నిష్క్రమించింది.

"ఈపిల్ల నీకెలా తెలుసునోయి" అన్నాడు రెడ్డి.

"మా శిష్యురాలు!" నవ్వాడు చంద్రశేఖరం.

"ఆడబ్బు నువ్వే యిస్తావన్నమాట!" చిలిపిగా చూశాడు రెడ్డి.

"బలేవాడివి! ఆమే ఇస్తుంది!"

"నిజంగా! నాకు నమ్మకంలేదు...శిష్యురాలు నీకు ఋణం తీర్చుకొంటుందిలే!" పకపక నవ్వాడు రెడ్డి.

మర్నాడు తనయింటికివచ్చి రమణమ్మ స్వయంగా కృతజ్ఞతలు చెప్పుకొంటుందనుకున్నాడు. మల్లుచొక్కా, గ్లాస్కోపంచ తొడుక్కొని, సెంటురాసుకొని, మల్లెపూలు యింట్లోచల్లి, అగరొత్తులు వెలిగించి - ఇరవై నాల్గుగంటలు ఆమెకోసం వేచికూర్చున్నాడు. రమణమ్మ రాలేదు. బహుశా కొత్తగూడెం వెళ్లిందేమో అనుకున్నాడు. తర్వాత క్లాసుకు కూడా రాలేదు. పనిచేస్తున్న ఆస్పత్రిలో కనుక్కుంటే వూళ్ళో మరో పెద్దాసుపత్రికి బదిలీఅయిందని విన్నాడు. రోజులు, నెలలుగడిచాయి.

రమణమ్మ జాడలేదు.

ఒకరోజు రెడ్డి, చంద్రశేఖరం కలిసి ఆమె కొత్త ఆసుపత్రికి ఆమెను పట్టుకుని అప్పు వాపసు తీసుకోడానికి వెళ్ళారు. తోటి నర్సులతో కబుర్లుచెప్పుకుంటూ పోతున్న రమణమ్మ రెడ్డికారుచూసి కొంచెం గాభరా పడి తట్టుకొని, నవ్వుతూవచ్చి యిద్దర్నీపిలిచి, టీయిచ్చి, నెలాఖరు జీతం రాగానే బాకీ యిచ్చేస్తానని. తల్లిదండ్రులు యిబ్బందిలో వుండడంచే బాకీ చెల్లించలేకపోయానని విచారంవ్యక్తంచేసింది. చంద్రశేఖరంనమ్మేశాడు. రెడ్డి గర్జించాడు, "ఇది ఆఖరివార్నింగు. వారంలోగా డబ్బు కట్టకపోతే కోర్టువారు ఆసొమ్ము వసూలుచేస్తారు- జాగ్రత్త" అన్నాడు రెడ్డి. అన్నంతపని చేశాడు రెడ్డి.

రమణమ్మకు. చంద్రశేఖరానికి తక్షణం డబ్బు కట్టమని నోటీసు యిచ్చాడు. ఆ నోటీసుచూసి గాభరాతో చంద్రశేఖరం రెడ్డివద్దకు పరుగెత్తుకు వెళ్ళాడు! రెడ్డి నవ్వేశాడు. మరో వారం తర్వాత యిద్దరూ ఆ ఆస్పత్రికివెళ్ళారు. రమణమ్మజాడలేదు. ఆమె కాకినాడ బదిలీఅయిందని వార్త. చంద్రశేఖరం నివ్వెరపోయాడు. రెడ్డి మందస్మితం చేశాడు.

రెడ్డికారు ఆసుపత్రి ఆవరణ దాటింది.

"చూశావా చంద్రశేఖరం! యిదీ అప్పు తీసుకునేవాళ్ళ వరస!... నువ్వు దాన్ని అనుభవించావా?" నిక్కచ్చిగా అడిగాడు రెడ్డి.

"లేదు- నామీదఒట్టు!" అన్నాడు చంద్రశేఖరం.

"ఛ-ఆడదానివన్నమాట" నవ్వేశాడు రెడ్డి.

"నువ్వు అనుభవించినా, అయిదువందలు పోయినందుకు విదారించే వాడినికాదు. నువ్వు నోటుమీదా సంతకంపెట్టి ఉండకపోతే దాన్ని మూడు చెరువులు నీళ్ళుత్రాగించేవాడిని... ఇప్పుడేంచేస్తాం! పెదిమవిరిచాడు రెడ్డి,

"నేను మెల్లిగా ఆడబ్బు తీర్చుకుంటా!" నమిలాడు చంద్రశేఖరం

"నాకు సిగ్గు. నీ దగ్గర వసూలు చేయటం" రెడ్డి హేళనగా నవ్వాడు..

నాల్గు నెలలు గడిచాయి,

చంద్రశేఖరం రెడ్డిముఖం చూపలేక పోయాడు.

రెడ్డి చంద్రశేఖరాన్ని బాకీ తీర్చమని అడగలేదు.

ఒక సాయంత్రం పార్కులో చంద్రశేఖరం ఒంటరిగా కూర్చుని గడ్డిపరక నమలుతున్నాడు.

రెడ్డి కనిపించాడు.

"ఏంభాయీ, దర్శనంలేదు. బుజంతట్టాడు రెడ్డి,

చంద్రశేఖరం కొంచెం దిగాలుగా వున్నాడు, అతనికి అర్జంటుగా రెండువందలు అవసరం పడింది. ఎవర్ని అడగాలా అని ఆలోచిస్తున్నాడు,

"ఏం అలా వున్నావు" అన్నాడు రెడ్డి అతని దిగాలు ముఖం చూసి,

చంద్రశేఖరం వున్న విషయం చెప్పాడు. భార్యకు పొట్ట ఆపరేషను జరిగిందని, డాక్టరుకు, మందులకు యీ సొమ్ము అవసరం పడిందని, రెడ్డిని అడగటానికి ముఖం చెల్లక రాలేదన్నాడు.

"అదెంత! తీసుకో యింటికిరా!" అన్నాడు రెడ్డి.

చంద్రశేఖరం ఆనందానికి అంతులేక పోయింది.

రెడ్డి యింటికి తీసుకువెళ్ళి రెండువందలు యిచ్చాడు.

"నీకు తోచినప్పుడు వాపసుచెయ్యి, ఫర్వాలేదు" నవ్వాడు రెడ్డి.

రమణమ్మ ప్రస్తావన వచ్చింది,

ఆ మాటల్లోనే అక్కడ రమణమ్మ ప్రత్యక్షమయింది.

చంద్రశేఖరం ఆశ్చర్యపోయాడు.

రమణమ్మ చంద్రశేఖరానికి నమస్కరించింది.

చంద్రశేఖరం కోపంగా చూశాడు,

రెడ్డి రమణమ్మను యింట్లోకి నడవమన్నాడు.

చంద్రశేఖరం మరీ ఆశ్చర్యపోయాడు.

"ఇంట్లో మీ భార్యకూ...యీ మెకూ స్నేహమా?" అన్నాడు చంద్రశేఖరం ఏమనాలో తెలియక.

"భార్య పుట్టింటికి వెళ్ళింది" నవ్వాడు రెడ్డి "మరీ నువ్వు ఒక్కడివేనా!''

"అందుకే...ఆమె లోనికి" మళ్ళీ నవ్వాడు రెడ్డి.

"ఎలా_ఏమిటి? నసిగాడు చంద్రశేఖరం,

''ఆమె నీవూరు బదిలీ చేయించావా," ఒక రోజు సాయంత్రం కారులో వెడుతూంటే ఆసుపత్రి దగ్గర కనపడింది, ఏదో పనిమీద యీ వూరు వచ్చిందట. నడిరోడ్డులో నిలబెట్టి మెళ్ళో బంగారు గొలుసు లాక్కున్నా...ఒక వెయ్యి రూపాయల ఖరీదు గొలుసు...లబోదిబోమని మొత్తుకుంది, పోలీసులని పిలిచింది, ఓ పోలీసు జవానువచ్చి, నన్ను చూసి, సంగతి తెలుసుకుని, నవ్వుతూ వెళ్ళిపోయాడు...మర్నాడు నా దగ్గరకు ఆమె వచ్చింది. బ్రతిమాలింది గొలుసు యిమ్మంది...యిస్తాను వస్తూండమన్నాను. కాని, పలహారాలు యిచ్చాను. కబుర్లు చెప్పాను. తర్వాత మచ్చిక అయింది. అందుకే యీ వూరు బదిలీ చేయించాను."

"నీకు బాకీ తీర్చిందా?''

"ఎందుకు తీర్చాలి?"

"అదేమిటి?"

"నేను గొలుసు వాపసు యిస్తేగా! వ్యాపారం_వ్యాపారమేగా?"

"మరి ఆమె అడగలేదా?"

"లేదు"

"అరె!_ఆశ్చర్యం!" అన్నాడు చంద్రశేఖరం నవ్వుతూ.

"నా స్నేహం రుచిమరిగింది. ఈ గూటిలోంచి యింక పోనం

టుంది." పకపక నవ్వాడు రెడ్డి. ఇంట్లో గదివైపుచూస్తూ...గదిలో పంజ రంలో పిట్టలా కూర్చుంది రమణమ్మ, రెడ్డి మాటలువింది_నవ్వుకుంది.

"ఏమండీ!" అని పిల్చింది రమణమ్మ.

చంద్రశేఖరానికి ఏమిటో నవ్వు, ఆనందం కలిగాయి. రెడ్డి అన్ని విధాలా తనకన్న సమర్థుడు అన్న సంతృప్తి చంద్రశేఖరానికి కలిగింది. అంత సమర్థతతోపాటు ఎంత మంచి స్నేహం అనుకున్నాడు చంద్ర శేఖరం చేతిలో డబ్బు చూసుకుని, ఆస్పత్రిలో భార్య రోగవదనం కళ్ళముందు కట్టింది. అభిమానంతో, అప్యాయతతో ముందడుగు వేశాడు చంద్రశేఖరం.

అందుకే తాను బడిపంతులునయ్యా ననుకుని, తన్నుగూర్చి తానే జాలిగా ఓసారి నవ్వుకున్నాడు చంద్రశేఖరం,

———